## క్లుప్తంగా

### రైతులకు రూ. 20 వేల సహాయం అందజేయాలి



వ్యవసాయ సహాయకునికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఖరీఫ్ పంటల సాగు కోసం 20 వేల రూపాయల సహాయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే అందజేయాలని రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫరీదుపేట, కేశవరావుపేట, ఎస్.ఎం.పురం రైతు సహాయ కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులకు వినతి పత్రాలను శుక్రవారం అందజేశారు. రైతులతోపాటు కౌలు రైతులకు కూడా సాయం అందించాలని కోరారు. ఖరీఫ్ ప్రారంభమైనా ఇంకా సహాయం అందజేయకపోవడంతో ఆర్థికంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ సహాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, లేదంటే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టవల్సి వస్తుందని అన్నారు. నాయకులు ఈశ్వరరావు, అప్పలరాములు, చంద్రరావు, ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

### ఎస్పీని కలిసిన మహిళా పోలీసులు



ఎస్పీ మహేశ్వరరెడ్డితో మహిళా పోలీసులు

రణస్థలం: జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని సచివాలయ మహిళా పోలీసులు శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంక్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలు, నిర్వర్తిస్తున్న విధులను మహిళా పోలీసులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పనిచేసిన వారికి డిపార్ట్‌మెంట్‌లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళ పోలీసులు బమ్మిడి అమ్మోజి, కె.భారతి, యమున, త్రివేణి, రత్నకుమారి ఉన్నారు.

### బెజ్జిపురం యూత్ క్లబ్ ఔదార్యం



విద్యార్థులతో యూత్ క్లబ్ ప్రతినిధులు

గార : బెజ్జిపురం యూత్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడూరి ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు శుక్రవారం ఆడవరం ప్రాథమిక పాఠశాలకు ఆటవస్తువులు, టీఎల్ఎం మెటీరియల్ వితరణ చేశారు. యూత్ క్లబ్ ప్రతినిధి ఉమామహేశ్వరవు ప్రధానోపాధ్యాయుడు బోగెల ఉమామహేశ్వరరావుకు వీటిని అందజేశారు.

### సాయిదర్బార్‌లో సామూహిక కుంకుమ పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురంలోని షిరిడీసాయి దర్బార్‌లో జరుగుతున్న గురుపూజోత్సవంలో భాగంగా శుక్రవారం సామూహిక సహస్ర కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ ఆధ్వర్యంలో దుర్గాహోమం జరిగింది. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

### విజయదుర్గకు విశేష అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలువీధిలో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేసిన తర్వాత ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శివారుకు సాగునీరు అందేనా?



రాగోలులో పంట పొలాలకు వెళ్లే గెడ్డలో పెరిగిన మొక్కలు



చాపురం పంచాయతీ పరిధిలో మొక్కలతో నిండిన గెడ్డ



గూడెం ప్రాంతంలో సాగునీటి కాలువ దుస్థితి

- పూర్తిస్థాయిలో జరగని గెడ్డలు, కాలువ పనులు
- ఆందోళనలో రైతులు

శ్రీకాకుళం రూరల్: శివారు ప్రాంత రైతులకు సాగు నీటి సమస్య వెంటాడుతోంది. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో సుమారు 15,250 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న మోస్తరు వర్షాలకు ఎక్కడికక్కడ నీటి నిల్వలు ఉండిపోయాయి తప్ప అవి పంట పొలాల్లోకి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. మరో వైపు చిన్నచిన్న గెడ్డలు, కాలువలు గుండా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. గతంలో జూలై నెలాఖరు నాటికే పూర్తి స్థాయిలో ఉడుపులు పూర్తయ్యేవి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎక్కువ మంది రైతులు వెద పద్ధతిలో సాగు చేసేందుకే సన్నద్ధమయ్యారు.

**ఆ కాలువపైనే ఆశలు..**

వాస్తవంగా ఏటా ఖరీఫ్ సీజన్ నాటికి నారాయణపురం, వంశధార నీటిపైనే మండల రైతులు ఆధారపడుతుంటారు. ప్రస్తుతం ఆయా గెడ్డలు, కాలువల్లో కలుపుమొక్కలు, గుర్రపు డెక్కలు పేరుకుపోయాయి. దీంతో నారాయణపురం పరిధిలతోని రాగోలు, సానివాడ, కిల్లిపాలెం తదితర పొంట పొలాలకు, వంశధార పరిధిలో సింగుపురం, బైరి, బైరిదేశిగెడ్డ శివారు ప్రాంతాల్లో పంట పొలాలకు నీరు అందనుంది. ఆయా ప్రాంతాల పరిధిలోని కాలువల్లో పూడికలు, పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క తొలగిస్తేనే పంట పొలాలకు సాగు నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు.

**పూడికలు తొలగించాలి..**



నాలుగు ఎకరాల్లో ఏటా ఖరీఫ్ వరి సాగుకు సన్నద్ధమవుతాం. ఈ ఏడాది ఇప్పటికే వెదలు జల్లే పరిస్థితి వచ్చింది. ఏటా కాలువలు, గెడ్డల ద్వారానే సాగునీరు అందుతుంది. గెడ్డలు, కాలువల్లో గుర్రపు డెక్క, కలుపు మొక్కలు తీయాల్సి ఉంది. ఆ పనులు పూర్తయితేనే సాగునీరు అందుతుంది.

– ఎం.సూర్యనారాయణ, రైతు, బైరివానిపేట

**ప్రతిపాదనలు పంపించాం..**

ఇరిగేషన్ శాఖలో నిధుల కొరత వెంటాడుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పనుల ద్వారా కాలువలు, గెడ్డల్లో పేరుకుపోయిన కలుపుమొక్కలను, గుర్రపు డెక్కలను తొలగించాం. చిన్నచిన్న గెడ్డలు, కాలువల్లో పనులు చేయాల్సి వుంది. వీటికి సంబంధించి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పనులు పూర్తిచేస్తాం.

– శ్రీనివాసరావు, ఇరిగేషన్ అధికారి, శ్రీకాకుళం

## రోడ్డుపై పశువులను వదిలేస్తే చర్యలు



పశువుల యజమానులతో మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ వెంకటరావు

సాక్షి ఎఫెక్ట్

శ్రీకాకుళం పీఎన్ కాలనీ : పశువులను రోడ్లపై విచ్చలవిడిగా రోడ్లపై వదిలేస్తే సీతంపేట అడవుల్లో విడిచిపెడతామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరావు పశువుల యజమానులకు హెచ్చరించారు. ఈ ప్రయాణం ప్రమాదం అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందనగా మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశాల మేరకు పశువుల యజమానులతో హెల్త్ ఆఫీసర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులను పాకలు, ఖాళీ స్థలాల్లో ఉంచాలని సూచించారు. రోడ్లపై పశువులు తిరగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. నిబంధనలు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఎంపీకి వినతి



ఎంపీ అప్పలనాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రణస్థలం: బంటుపల్లిలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో పని చేస్తూ.. అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడును రణస్థలంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మనాయుడు మాట్లాడుతూ.. 21 ఏళ్లుగా కార్మికులుగా క్రమశిక్షణతో పనిచేస్తున్న జె.గంగరాజు, పి.సత్యన్నారాయణ, జి.శంకర్, ఎండ తవుడు, కె.గొల్లబాబులను ఈ నెల 15వ తేదీ నుంచి ముందస్తు నోటీస్ లేకుండా అక్రమంగా నిలుపుదల చేయడం తగదన్నారు. యాజమాన్యం కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందని అన్నారు. ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, నిలుపుదల చేసినప్పటి నుంచి వేతనం చెల్లించేలా కృషి చేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో పి.సత్యనారాయణ, జి.శంకర్, ఎండ తవుడు, కె.గొల్లబాబు ఉన్నారు.

## బ్యాంకులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న కేసీహెచ్ వెంకటరమణ

శ్రీకాకుళం అర్బన్: బ్యాంకుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ ప్రతినిధి, ఎస్‌సీబీఈ నాయకులు కెసీహెచ్ వెంకటరమణ అన్నారు. బ్యాంకుల జాతీకరణ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయ సమావేశ మందిరంలో 'బ్యాంకుల జాతీయికరణ లక్ష్యాలు–సంస్కరణల ప్రభావం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏబీపీ నాయకుడు మండ శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ సంస్కరణల పేరిట కార్పొరేట్ బ్యాంకింగ్ వల్ల సామాన్యులు ఎలా నష్టపోతున్నారో వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కిషోర్, పోస్టల్ నాయకులు కె.గణపతి, గిరిధర్, గరిమెళ్ల అధ్యయన వేదిక అధ్యక్షుడు వీజీకే మూర్తి, ఏఐబీవోసీ నాయకులు గొర్లె వెంకట రమణ మూర్తి, పాపారావు, యూనియన్ బ్యాంకు నాయకులు కృష్ణబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రెండో పట్టణ పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి గురువారం సందర్శించారు. ముందుగా సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు ఎస్పీ మొదటి సారి స్టేషన్‌కు రావడంతో సిబ్బందితో స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ రికార్డులను, సీసీ ఫుటేజీ కమాండ్ కంట్రోల్, పరిశీలించారు. ఎస్‌ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలో 53 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నిరుద్యోగ యువత తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యంతో పాటు అనుభవాన్ని గడించాలని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం సంగీత్ మొబైల్స్, కేఎల్ గ్రూప్ సంస్థల్లో ఖాళీలకు నిర్వహించిన జాబ్‌మేళాలో 53 మంది ఎంపికయ్యారు. తొలుత జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం ఆమె నిరుద్యోగులకు పలు సూచనలు చేసి, అనేక అంశాలపై దిశానిర్దేశం చేశారు. సంగీత్ మొబైల్స్‌కు 32 మంది, కేఎల్ గ్రూప్‌కు 21 మంది ఎంపికైనట్టు చెప్పారు.

### ఆమె నేత్రాలు సజీవం



గవిరమ్మ(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్ : బలగలోని బావాజీతోటలో నివాసముంటున్న కె.గవిరమ్మ(95) అనారోగ్యం కారణంగా శుక్రవారం మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు డి.సూర్యారావు, జి.సత్యవతి, డి.సత్యనారాయణలు నేత్రదానానికి ముందుకొచ్చారు. విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, సహాయకులు నంది ఉమాశంకర్‌లు వచ్చి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

## తపాలా ఉద్యోగుల నిరసన



హెడ్‌పోస్టాఫీసు వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్ : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలని తపాలా శాఖ యూనియన్ ప్రతినిధి కె.గణపతి డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం పోస్టల్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గతంలో సార్వత్రిక ఎన్నికల కారణంగా నిలిపివేసిన కార్యాచరణ కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని జూన్ 29న న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. 8వ వేతన కమిటీ ఏర్పాటు, ఓపీఎస్ పునరుద్ధరణ, కోవిడ్ కాలంలో స్తంభింపచేసిన 18 నెలల డీఏ/డీఆర్ విడుదల, ఇతర ప్రధాన డిమాండ్ల పరిష్కారం కాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు లంచ్ అవర్ ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డివిజన్ అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘాల నాయకులు బాబూరావు, యు.వి.రమణ, పెన్షనర్స్ సంఘం నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: పిల్లలు విద్యాభ్యాసం నుంచే క్రమశిక్షణతోపాటు దేశభక్తిని అలవాటు చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. గురుపూజోత్సవంలో భాగంగా బంటుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురుపూజ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు శారీరక, మానసిక దృఢత్వం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ముఖ్యవక్త పీవీ రమణ, ఉత్తరాంధ్ర ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు రాజశేఖర్, శేషగిరిరావు, బీజేపీ నాయకులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న సూపర్‌వైజర్

శ్రీకాకుళం అర్బన్: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు గూనపాలెం సెక్టారు సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. నగరంలోని కమలానివాస్, పద్మావతినగర్ కాలనీ ప్రీస్కూల్ తదితర ప్రాంతాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున నీరు కలుషితం అవుతుందని, వేడినీటినే తాగాలన్నారు.

ఇళ్ల పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.కళ్యాణి, ఆయాలు హనుమంతు విజయలక్ష్మి, ఎస్.హాసినా, ఆశావర్కర్ అమ్మాజీ పాల్గొన్నారు.

## తిరిగి వస్తున్న తహసీల్దార్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన తహసీల్దార్లు మళ్లీ వెనక్కి వస్తున్నారు. సొంత జిల్లాలలో పనిచేయరాదన్న ఎన్నికల నిబంధనల మేరకు జిల్లా నుంచి 45 మంది తహసీల్దార్లు ఫిబ్రవరి 2వ తేదీన బదిలీపై ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం (జోన్ 1లో) జిల్లాలకు వెళ్లారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిపోయి కొత్త ప్రభుత్వం కూడా రావడంతో వారంతా తిరిగి జిల్లాకు వస్తున్నారు.

ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం మెమో నంబర్ ఆర్‌బీ–1ను విడుదల చేసింది. మరో రెండు రోజుల్లో వారంతా జిల్లాకు రానున్నారు. జిల్లాకు వచ్చిన తర్వాత తహసీల్దార్లు కలెక్టర్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

## సింహాచలేశుని గిరిప్రదర్శనకు జిల్లా భక్తులు

- సుమారు 50 వేల మంది తరలివెళ్లే అవకాశం
- ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు తగ్గించడంపై భక్తుల అసంతృప్తి

శ్రీకాకుళం: దేశంలో అరుణాచలం, సింహాచలం గిరి ప్రదర్శనలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. గిరి ప్రదర్శన చేస్తే ముక్తి లభిస్తుందని, పాపాలు నశిస్తాయని, కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ప్రతి రోజు అరుణాచల గిరిప్రదర్శన జరుగుతుంది. సింహాద్రి అప్పన్న గిరిప్రదర్శన మాత్రం ఏడాదిలో ఒక రోజు మాత్రమే జరుగుతుంది. ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున జరిగే ఈ గిరిప్రదర్శనకు సుమారు 10 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. ఇందులో భాగంగా శనివారం సింహాచలం అప్పన్న తొలి పావంచా నుంచి గిరిప్రదర్శన ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి గిరిప్రదర్శనకు సుమారు 50 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. 32 కిలోమీటర్ల మేర గిరిప్రదర్శన జరుగుతుంది. శనివారం సాయంత్రం 4 గంటలకు స్వామివారి పుష్పరథం ప్రారంభమవుతుంది. అడవివరం, ఆరిలోవ, హనుమంతువాక, కైలాసగిరి టోల్ గేట్, అప్పుఘర్ జంక్షన్, ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, కైలాసపురం, మాధవధార, బుచ్చిరాజుపాలెం, ఇందిరానగర్, గోపాలపట్నం, గోశాల జంక్షన్ తొలిపావంచా మీదుగా సింహాచలం మెట్ల మార్గం వద్దకు చేరుకుంటారు. జిల్లాలో ఆర్టీసీ అధికారులు అదనపు సర్వీసులను నెలకొల్పాల్సి ఉండగా అందుకు భిన్నంగా ఉన్న సర్వీసులను తగ్గిస్తుండటంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నంలో ట్రాఫిక్ నిబంధనలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.



## వికసించిన బ్రహ్మకమలాలు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు గ్రామంలో గణేష్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి బ్రహ్మకమలం పుష్పాలు వికసించాయి. జిల్లా వైద్యశాఖాధికారి కార్యాలయం ఉద్యోగి రామచంద్రరావు తన పెరటిలో కొద్ది రోజులుగా ఈ మొక్కను సంరక్షిస్తున్నారు. బ్రహ్మకమలాలను చూసేందుకు కాలనీవాసులు ఆసక్తి చూపారు.



వికసించిన పుష్పాలు

## ఏక పాత్రాభినయ పోటీలకు ఎంపికలు పూర్తి



ఎంపికలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఆగస్టులో నిర్వహించే నెలవారీ కార్యక్రమానికి ఏకపాత్రాభినయ కళాకారుల ఎంపికలు పూర్తి చేసినట్లు నిర్వాహకులు చిట్టి వెంకటరావు, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, ఇంజరాపు రమణారావు, రామచంద్రదేవ్ శుక్రవారం తెలిపారు. ఉత్తరాంధ్ర స్థాయిలో 50 ఎంట్రీలు రాగా అందులో 30 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. శ్రీకృష్ణ, ఆంజనేయ, అర్జున, కర్ణ, నక్షత్రక, విశ్వామిత్ర, హరిధ్వజుడు, హరిశ్చంద్ర, చంద్రమతి తదితర పాత్రలు ఎంపికైనట్లు వివరించారు. ఆగస్టు 3న ఉదయం 9 గంటల నుంచి ప్రదర్శనలు ప్రారంభమవుతాయని తెలిపారు. సాయంత్రం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

## జెమ్స్‌లో ఐవీఎఫ్ కేంద్రం పరిశీలన



ఐవీఎఫ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

శ్రీకాకుళం రూరల్ : రాగోలు జెమ్స్ ఆసుపత్రిలోని ఐవీఎఫ్ కేంద్రాన్ని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి శుక్రవారం పరిశీలించారు. సౌకర్యాలు, పరికరాల పనితీరుపై ఆరా తీశారు. గైనకాలజిస్ట్ శిరీష, పెథాలజిస్ట్ లక్ష్మీవాసవీ, రేడియాలజిస్ట్ గౌతమి, స్వచ్ఛంద సంస్థ సేవకులు అచ్యుతరావు, మంత్రి వెంకటస్వామి, డిప్యూటీ డెమో వెంకటేశ్వరావు, జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.